క్లుప్తంగా

1,039 మందికి మధుమేహ పరీక్షలు



పాన్‌గల్: 30 ఏళ్లు పైబడిన వారందరూ తప్పక మధుమేహ (షుగర్) పరీక్షలు చేయించుకోవాలని సీహెచ్‌ఓ రామయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న మధుమేహ పరీక్షలను ఆయన పరిశీలించారు. షుగర్ పరీక్షలు చేయించుకోవడంతో ఆరోగ్య పరిస్థితులు తెలిసి దానికి అనుగుణంగా జాగ్రత్తలు పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వైద్య సిబ్బందికి అందరూ సహకరించి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మండలంలోని 10 సబ్‌సెంటర్ల పరిధిలో 1,039 మందికి పరీక్షలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడిని చేరదీసిన స్థానికులు



కొత్తకోట రూరల్: గుర్తు తెలియని బాలుడు కొత్తకోటలో తిరుగుతుండగా కొందరు వ్యక్తులు చేరదీశారు. బాలుడితో వివరాలు రాబట్టేందుకు ప్రయత్నించినా సమాధానం చెప్పకపోవడంతో వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాబు ఆచూకీ తెలిసిన వారు కొత్తకోట పోలీస్‌స్టేషన్‌లో, ఫోన్ నంబర్ 87126 70621 కు సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని అంబ భవానీ శంకర ఆలయంలో కొత్తకోట సీఐ రాంబాబు ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులుగా జరిగిన ధ్వజస్తంభ, గోపురం ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా సీఐ ఆలయానికి చేరుకొని ధ్వజస్తంభానికి పూజ చేయడంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన సీఐకి అర్చకులు, ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు శాలువాతో సత్కరించారు.

పండిత్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి



అమరచింత: పండిత్ దీన్‌దయాళ్ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని బీజేపీ జెండా కట్ట వద్ద బీజేపీ నాయకులు మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన మహానాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, మరాఠి అశోక్, శ్రీనివాస్ యాదవ్, రామకృష్ణారెడ్డి, విజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



కొత్తకోట (ఆత్మకూర్): సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ నరేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని మోట్లంపల్లిలో సీసీ కెమెరాల ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ముందుకు రావాలని, స్వచ్ఛందంగా విరాళాలు అందించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈసందర్భంగా గ్రామస్తులు రూ.50 వేలు సమకూర్చి ఎస్‌ఐకు అందజేశారు.

ఉపాధి పనుల తనిఖీ

కోడేరు: మండల కేంద్రంలోని ఉపాధి హామీ పనులను సోమవారం ఏపీఓ నాగరాజు తనిఖీ చేశారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని ఆయన తెలిపారు. అనంతరం మస్టర్లలో నమోదైన కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్ వెంకటస్వామి, పంచాయతీ కార్యదర్శి రవితేజ పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు

వనపర్తి: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు ఏర్పాటు చేశామని.. ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదర్శ్ సురభి హెచ్చరించారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, ఎస్పీ రావుల గిరిధర్, ఎస్‌ఐలు, తహసీల్దార్లతో నిర్వహించిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 12 ఇసుక రీచ్‌లు ఉన్నాయని.. గృహ నిర్మాణాలకు మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకే ఇంటి వద్దకు సరఫరా చేస్తున్నామన్నారు. అక్రమంగా ఇసుక తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రీచ్‌కు తహసీల్దార్, ముగ్గురు పోలీసు, ఒక రెవెన్యూ సిబ్బందితో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ బృందాలు నిరంతరం రీచ్‌లలో తనిఖీలు నిర్వహించాలని, అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేయాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెట్ వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి తనిఖీ ఫొటోలు, సమాచారం పోస్టు చేయాలని సూచించారు. ఒక ట్రాక్టర్ పట్టుకుంటే రూ.500, టిప్పర్ పట్టుకుంటే రూ.వెయ్యి నజరానాను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలకు ఇవ్వనున్నట్లు చెప్పారు. మన ఇసుక వాహనం ద్వారా ఒక ట్రిప్ బుక్ చేసుకొని అంతకుమించి తరలించి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని.. జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటుచేయాలని ఆదేశించారు. పెబ్బేరు మండలం రామన్నపేట, వీపనగండ్ల మండలం తూంకుంట రీచ్‌ల నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్న తన దృష్టికి వచ్చిందని.. ప్రతి రీచ్ వద్ద సీసీ కెమెరాలు, లైట్లు, ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు

అక్రమ రవాణాపై ఉక్కుపాదం..

అక్రమ ఇసుక వ్యాపారంపై ఉక్కుపాదం మోపేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని.. రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమ రవాణాను అరికట్టేందుకు తనవంతు కృషి చేస్తామని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. మండల పోలీస్ అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్డీఓ సుబ్రమణ్యం, మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఇసుక..

జిల్లాలో ఇళ్ల నిర్మాణదారులకు మన ఇసుక వాహనం ద్వారా తక్కువ ధరకే సరఫరా చేస్తున్నామని కలెక్టర్ ఆదర్శ్ సురభి మంగళవారం వేరు వేరు ప్రకటనలో తెలిపారు. http://tsmiv.cgg.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి అవసరమైన మేర బుక్ చేసుకోవచ్చని.. రీచ్ దూరాన్ని బట్టి రూ.1,750 నుంచి రూ.3,750 వరకు నిర్ణయిస్తామని పేర్కొన్నారు. ఇసుక బుక్ చేసుకోవడం చాలా సులువని.. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏవైనా ఇబ్బందులుంటే కలెక్టరేట్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలన్నారు.

ప్రత్యేక నిఘా

వనపర్తి: జిల్లా పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రావుల గిరిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు ప్రత్యేక నిఘా పెట్టి ఇసుక అక్రమ రవాణా చేసే వారిని గుర్తించాలని ఆదేశించారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో దాడులు చేసి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ చట్టం, మైన్స్ అండ్ మినరల్స్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా గురించి ప్రజలు సమాచారం అందించాలని, 100 లేదా పోలీస్ కంట్రోల్ రూం 63039 23200 నెంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

కంటిచూపుపై శ్రద్ధ చూపాలి

వనపర్తి: విద్యార్థులకు కంటిచూపు సరిగా ఉన్నప్పుడే చదువుపై చక్కగా దృష్టి కేంద్రీకరించగలరని, అందుకోసమే జిల్లాలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల చేయిస్తున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని జెడ్పీ ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, కంటి చూపు సమస్యలు ఉన్నవారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 300 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 30వేలకు పైగా మంది విద్యార్థులకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయించగా.. దాదాపు 2వేల మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. వారిలో 946మంది విద్యార్థులకు ఉచితంగా కళ్లద్దాలు అందించారు. అనంతరం అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ విద్యార్థులు కంటిచూపు సరిగా ఉన్నప్పుడే బాగా చదవగలరని భావించిన కలెక్టర్ తన నిధుల నుంచి ప్రత్యేకంగా విద్యార్థుల కోసం ఉచితంగా కళ్లద్దాల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, బాలుర పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలు వినియోగించి బోధన

పాన్‌గల్: ఉపాధ్యాయులు సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకొని వాటిని వినియోగిస్తూ బోధిస్తే విద్యార్థులకు సరళంగా అర్థమవుతుందని ఎంఈఓ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆంగ్ల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో చేసే బోధన విద్యార్థులకు చాలా సులభంగా అర్థమవుతుందన్నారు. ఉపాధ్యాయుల బోధనకు టెక్నాలజీని జోడిస్తే ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠ పెరిగి విద్యార్థుల నమోదు పెరిగే అవకాశం ఉంటుందని సూచించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సామర్థ్యాలను పెంచాలన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య

ఆత్మకూర్/అమరచింత: ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్య అందుతుందని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పదో తరగతి అనంతరం విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరాలని అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం డీఐఈఓ అంజయ్య, ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్‌రెడ్డి సూచన మేరకు స్థానిక ప్రభుత్వ కళాశాల ఇంగ్లిష్ అధ్యాపకుడు కురుమూర్తి, కెమిస్ట్రీ అధ్యాపకుడు బుచ్చయ్య అమరచింత, ఆత్మకూర్ మండలాల్లో పర్యటించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలుగు, ఆంగ్లంలో విద్యా బోధనలు జరుగుతున్నాయని, ఒకేషనల్ కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు ప్రైవేట్ కళాశాల్లో చేరి తల్లిదండ్రులకు ఆర్థిక భారం కలిగించకుండా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం మండల విద్యాధికారి భాస్కర్‌సింగ్‌కు అడ్మిషన్ డ్రైవ్ సందర్భంగా వినతి పత్రాన్ని అందించారు.



ఎంఈఓ భాస్కర్‌సింగ్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు

గడ్డివాము దగ్ధం

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి సమీపంలో ఓ రైతు పశువుల కోసం ఏర్పాటు చేసుకున్న గడ్డివాము మంగళవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. కాలనీవాసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రానికి చెందిన రైతు నర్సింహ పశువుల మేత కోసం ఇంటికి సమీపంలోనే గడివాము ఏర్పాటు చేసుకున్నాడు. మంగళవారం ఉదయం గడ్డివాముకు మంటలు అందుకోవడంతో సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది బస్టాండు నుంచి ఎస్సీ కాలనీ మీదుగా ఘటన స్థలానికి వెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ రోడ్డు ఇరుకుగా ఉండటం, కరెంటు వైర్లు కిందకు ఉండటంతో అమ్మచెరువు కట్టమీద నుంచి వెళ్లేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. దీంతో ఫైర్ ఇంజిన్ బుద్దారం వెళ్లి అక్కడి నుంచి వనపర్తి రోడ్డు, చెన్నూరు మీదుగా గడ్డివాము దగ్గరికి వచ్చి మంటలను ఆర్పింది. రోడ్డు సరిగా ఉంటే తక్కువ నష్టం జరిగేదని, రోడ్డు బాగాలేని కారణంగా ఫైర్‌ఇంజిన్ గంట లేటుగా రావడంతో నష్టం ఎక్కువగా జరిగిందని స్థానికులు తెలిపారు. రూ.రెండు లక్షల వరకు నష్టపోయానని రైతు వాపోయాడు.



గోపాల్‌పేటలో గడ్డివాముకు అంటుకున్న మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చెన్నారంలో షార్ట్‌సర్క్యూట్

ఏదుల మండలంలోని చెన్నారంలో బంకల జ్యోతి ఇంట్లో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. కుటుంబ సభ్యులు మేల్కొని బయటికి రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం అధికారులు ఇంటి వద్దకు చేరుకుని పంచనామా నిర్వహించారు. తక్షణ ఆర్థికసాయంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి పంపిన రూ.ఐదు వేలను స్థానిక కాంగ్రెస్ నాయకులు శాంతయ్య, రాంచందర్, సురేందర్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

స్థానిక సంస్థల ఓటరు జాబితా విడుదల



ఆత్మకూర్‌లో ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి

ఆత్మకూర్: మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను మంగళవారం అధికారులు ప్రకటించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీరాంరెడ్డి మాట్లాడుతూ మండలంలో 7 ఎంపీటీసీలు, ఒక జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన జాబితా విడుదల చేశామన్నారు. మండలంలో 13 పంచాయతీల్లో 118 వార్డులు ఉండగా.. 35 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. మండలవ్యాప్తంగా 31,269 మంది ఓటర్లు ఉన్నారని, ఈనెల 13వ తేదీలోపు అభ్యంతరాలు ఉంటే తెలపాలని, 15న తుది జాబితా వెల్లడిస్తామన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాన్‌గల్: స్థానిక ఎన్నికల్లో భాగంగా పాన్‌గల్ ప్రాథమిక, బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ రఘురాములు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు వంటి వసతులు ఉన్నాయా ఇంకా ఏమైనా వసతులు ఏర్పాటు చేయాలా అనే అంశాలను పరిశీలించినట్లు వారు పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే వాటిని పరిష్కారించాలని క్షేత్ర స్థాయి సిబ్బందికి వారు సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి నరేష్, మహేష్ పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో..

నిలిచిన పనులు ప్రారంభించాలి

కొత్తకోట: మున్సిపల్ కేంద్రంలో కొన్ని రోజులుగా నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని మంగళవారం బీజేపీ జిల్లా నాయకుడు, దేవరకద్ర నియోజకవర్గ కోకన్వీనర్ కొమ్ము భరత్‌భూషణ్ ఒక ప్రకటనలో కోరారు. అందులో భాగంగా కొత్తూరు గ్రామ రహదారి పనులు తక్షణమే ప్రారంభించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 4, 7, 11 వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ ఎంపీ నిధుల కింద నిధులు విడుదల చేశారని హర్షం వ్యక్తం చేశారు. ఆ పనులకు మున్సిపల్ తీర్మాణం ఇవ్వాలని, లేదంటే నిరాహార దీక్షకు ఉపక్రమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈదమ్మ బోనాలు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఈదమ్మ గుడికి మంగళవారం గ్రామ మహిళలు, భక్తులు బోనమెత్తారు. ఇంటి వద్ద తయారు చేసిన వంటకాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చిన మహిళలు ఈదమ్మకు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ సర్పంచు శ్రీనివాసులు దంపతులు ఈదమ్మకు వడి బియ్యం నింపారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించగా.. హనుమాండ్లగడ్డ, గోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు.

ఆహ్వాన పత్రిక అందజేత

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణ ఆలయంలో ప్రతిష్ఠించనున్న శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు ఈనెల 13 నుంచి జరుగనున్నాయి. ఆలయంలో జరిగే కార్యక్రమాల్లో ప్రత్యేక పూజలకు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ రావుల గిరిధర్‌ను వేరు వేరుగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. అందుకు కలెక్టర్, ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆహ్వాన పత్రికలను అందజేసిన వారిలో తిమ్మన్న యాదవ్, సత్యంయాదవ్, హన్మంత్‌యాదవ్, శంకర్ యాదవ్, పెంటన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

కేసు నమోదు

పాన్‌గల్: విధులకు ఆటంకం కలిగించి పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన ఘటనలో ఇద్దరిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాందాపూర్‌లో మంత్రి జూపల్లి పర్యటన నిమిత్తం గ్రామంలోని గాంధీ విగ్రహం వద్ద మంత్రి జూపల్లి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ గోవర్ధన్‌సాగర్ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ధ్వంసం చేశారనే సమాచారం మేరకు మంగళవారం విచారణ నిమిత్తం గ్రామానికి వెళ్లిన పోలీసులతో గ్రామానికి చెందిన గొబ్బురి నరేష్, బాసు బీషయ్య దురుసుగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించారని పీసీ మన్సూర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గేమ్యానాయక్‌తండాను గ్రామ పంచాయతీ చేయాలి

కొల్లాపూర్: మండలంలోని గేమ్యానాయక్ తండాను గ్రామ పంచాయతీ చేయాలని మంగళవారం ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తండా వాసులు మాట్లాడుతూ పంచాయతీగా గుర్తింపు పొందేందుకు అవసరమైన జనాభా గేమ్యానాయక్ తండాకు ఉందన్నారు. ఈ మేరకు ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు,. కార్యక్రమంలో తిరుపతినాయక్, తారాసింగ్, బాలు, తదితరులు ఉన్నారు.



ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

వనపర్తి విద్యావిభాగం: సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో ఆన్‌లైన్‌లో సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15 మండలాల నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారని జిల్లా మానిటరింగ్ అధికారి గణేష్ పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన వారిలో ఎస్.నిఖిల్ (జెడ్పీహెచ్ఎస్, తిప్పుడంపల్లి), మనోజ్ (జెడ్పీహెచ్ఎస్, వీపనగండ్ల), జె.ఉదయ్‌కిరణ్ (జెడ్పీహెచ్ఎస్, బలిజపల్లి), ఎ.గణేష్ (జెడ్పీహెచ్ఎస్, బుసిరెడ్డిపల్లి) ఉన్నారు. వీరికి బహుమతులు ప్రదానం చేస్తూ రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పరీక్షల విభాగం అధిపతి చంద్రశేఖర్, జిల్లా ఏఎంఓ మహానంది, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గురురాజు, ఎఫ్‌పీఎస్‌టీ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, వీణాచారి తదితరులు ఉన్నారు.



సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

14 నుంచి రాజావళి ఉర్సు

అమరచింత: పట్టణంలో వెలసిన రాజవళీ దర్గా ఉర్సు ఫిబ్రవరి 14 నుంచి 16 వరకు కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. 14న గంధోత్సవం, 15న తాజేచిరాక్, 16న ఖత్మేఖురాన్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని వారు పేర్కొన్నారు. ఉర్సు సందర్భంగా చాదర్ ఊరేగింపుతో పాటు ఆల్‌ఇండియా కృష్ణ, మహేష్ బాబు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఖాదర్ ఘోరీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.



ముస్తాబైన రాజావళి దర్గా

ప్రభుత్వ పాఠశాల ప్రహరీ ధ్వంసం

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంపౌండ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కూలగొడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పాఠశాల మైదానాల్లో అసాంఘిక కార్యక్రమాలు పేట్రేగాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తుండటంతో పరీక్ష కేంద్రంగా కొనసాగుతున్న జెడ్పీహెచ్ఎస్ పాఠశాల కంపౌండ్‌కు ఉన్న రంధ్రాన్ని మూసివేయట్లేదు. వీటి వ్యవహారంలో అధికారులు పట్టించుకోకపోవడంతో పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన కంపౌండ్‌ను సైతం కూలగొట్టారు. రాత్రి వేళల్లో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించకపోవడంతో పాఠశాల మైదానాల్లో ఎలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయో అర్థం కావడం లేదని ఆయా పాఠశాల సమీప ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంపౌండ్‌కు మరమ్మతు చేపట్టి రాత్రి వేళల్లో పాఠశాలల వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.



జెడ్పీ ఉన్నత పాఠశాలలో కూల్చిన ప్రహరీ

పాఠశాల ఆవరణలో వరాహాల సంచారం



పాన్‌గల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల పక్కనే సంచరిస్తున్న వరాహాలు



వంట గది పక్కన..

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఒక పక్క పందుల సంచారం, మరోపక్క కోతుల బెడదతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి ప్రతి నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పందుల సంచారం, కోతుల బెడదతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాలకు రెండు పక్కల ప్రహరీ గోడ లేకపోవడంతో ఈ ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఉపాధ్యాయులు వాపోతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో పాఠశాలకు వచ్చిన మంత్రి జూపల్లి దృష్టికి సమస్యలను తీసుకెళ్లగా.. స్పందించిన ఆయన ఆయా పనులు వెంటనే చేపట్టాలని స్థానిక నాయకులకు సూచించారు. కానీ ఇప్పటి వరకు వాటి గురించి పట్టించుకున్న వారే లేరని విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం విద్యార్థులు భోజనాలు చేస్తున్న సమయంలో పందులు సంచరిస్తూ కనిపించాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అసంపూర్తి ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కోడేరు: మండల కేంద్రంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ తెలిపారు. ఉదయం సుప్రభాతసేవ, గణపతిపూజ, పుణ్యాహవచనం, రక్షబంధన, అఖండ దీపారాధన, నవగ్రహ పూజ, కలశస్థాపన, రుత్వికరణ, మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. 13న సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజలు, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, ప్రదోశకాల పూజలు, భజన మహామంగళహారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న సుప్రభాత సేవ, ప్రాతఃకాల పూజ, సత్యనారాయణస్వామి వ్రతం, రథోత్సవం, దూపోత్సవం, మహామంగళహారతి, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా అన్నమాచార్య ట్రస్టు తిరుమల తిరుపతి దేవస్థానం కళాకారులు సురేష్ ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన వేంకటేశ్వరస్వామి ఆలయం